
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 25 ఏప్రిల్ 2024



ఉత్తరాది రాష్ట్రాల్లో

ప్రచారానికి స్టాలిన్



రాష్ట్ర మంత్రులతో సీఎం స్టాలిన్

ప్యారీస్, ఏప్రిల్ 24: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 'ఇండియా' కూటమికి మద్దతుగా ఉత్తరాది రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రచారం చేపట్టనున్నారు. ఈ నెల 19న జరిగిన లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 నియోజకవర్గాల అభ్యర్థులకు మద్దతుగా డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రచారంలో పాల్గొన్నారు.స్టాలిన్ ప్రసంగం కూటమి నేతలు, అభ్యర్థుల్లో ఉత్సాహం నింపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆరు విడతలుగా ఎన్నికలు జరుగనున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఉత్తరాది రాష్ట్రాల్లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న బహిరంగ సభల్లో సీఎం స్టాలిన్ పాల్గొంటారని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం ప్రకటించింది. స్టాలిన్ పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధమవుతున్నట్లు డీఎంకే నేతలు తెలిపారు.

గిరి ప్రదక్షిణకు వెళ్లి వస్తూ....

కారును ఢీకొన్న వ్యాను ● ముగ్గురి మృతి

ప్యారీస్, ఏప్రిల్ 24: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైకు వెళ్లి గిరి ప్రదక్షిణ ముగించుకొని బుధవారం తెల్లవారుజామున తిరిగివెళ్తున్న కారును వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. వివరాలిలా వున్నాయి... ఈరోడ్ జిల్లాకు చెందిన వడివేలు, మోహన్‌రాజ్, జ్యోతి, ఇందుజ, అంబికాపతి, అనిత మంగళవారం కారులో తిరువణ్ణామలై చేరుకొని రాత్రి గిరి ప్రదక్షిణ చేశారు. వారు స్వామివారి దర్శనానంతరం తెల్లవారుజామున కారులో తిరిగి బయల్దేరారు. ఆ కారు త్యాగద్రుగం మార్గంలో ఉన్న పొన్నిఏందల్ ప్రాంతానికి ఉదయం 6 గంటలకు చేరుకున్న సమయంలో కొడైకెనాల్ నుంచి తిరువణ్ణామలై వైపుకు వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి హఠాత్తుగా కారును ఢీకొంది. అందులో కారు ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణం చేసిన వడివేలు, మోహన్‌రాజ్, జ్యోతికలకు తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే కన్నుమూశారు. వారితో ప్రయాణం చేసిన ఇందుజ, అంబికాపతి, అనితకు గాయాలయ్యాయి. వారిని ఆ మార్గంలో వెళ్లిన వారు అంబులెన్స్ ద్వారా కళ్లకుర్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న తిరుకోవిలూర్ పోలీసులు ముగ్గురు మృతదేహాలు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసిన పోలీసులు, తిరువణ్ణామలైకు చెందిన వ్యాన్ డ్రైవర్ జలాలుద్దీన్ వద్ద విచారణ చేపట్టారు.



ప్రమాదానికి గురైన కారు

క్యాష్ రాజా రాజ్యం


● ఎన్నికల ఫలితాలపై బెట్టింగుల జోరు

లక్షల్లో పందెం కడుతున్న కుర్రకారు



చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో తొలివిడతలోనే ముగియడంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. అయితే ఫలితాల కోసం జూన్ 4వ తేదీ వరకు నిరీక్షించాల్సిరావడంతో ఈ ఉత్కంఠ రోజురోజుకు పెరిగిపోతోంది. ఇదే సమయంలో ఈ ఎన్నిక ఫలితాలపై పందేలు జోరుగా సాగుతున్నాయి. డీఎంకే, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, ఐయూఎంఎల్, మక్కల్‌నీది మయ్యం నేతృత్వంలోని 'ఇండియా' కూటమి, అన్నాడీఎంకే, డీఎండీకే, పుదియ తమిళగం పార్టీల నేతృత్వంలోని కూటమి, బీజేపీ, పీఎంకే, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి హోరాహోరీగా ప్రచారం చేయగా, ఈ నెల 19వ తేదీన పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఇండియా కూటమి తరఫున ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తదితరులు, ఎన్‌డీఏ తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు ప్రచారం చేశారు. ఇండియా కూటమి తరఫున రాహుల్‌గాంధీ కేవలం రెండుసార్లు మాత్రమే ప్రచారం చేయగా, ఎన్‌డీఏ కూటమి తరఫున ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏకంగా ఏడుమార్లు ప్రచారం చేశారు. మరీ ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షులు, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, పొన్ రాధాకృష్ణన్, తమిళిసై, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ తదితరులు ప్రాతినిధ్యం వహిస్తున్న కోయంబత్తూరు, కన్నియాకుమారి, చెన్నై, తిరునల్వేలి తదితర ప్రాంతల్లో ఆయన రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. ఇక ఆదిలో లోక్‌సభ ఎన్నికలను తేలిగ్గా తీసుకున్న అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి.. ఆ తరువాత సీరియస్‌గా పరిగణించి విస్తృత ప్రచారం చేపట్టారు.

ఎన్నికలకు ముందు పలు సంస్థలు నిర్వహించిన సర్వేలు ఇండియా కూటమికే ఆధిక్యత కట్టబెట్టగా, అన్నాడీఎంకే కూటమికి 4-5 స్థానాలు, బీజేపీకి 1-2 స్థానాలు వస్తాయని పేర్కొన్న విషయం తెలిసిందే. పలు స్థానిక పత్రికలు నిర్వహించిన సర్వేలు సైతం ఇదే విధమైన ఫలితాలను వెల్లడించాయి. దీంతో రాష్ట్రంలో ఫలితాలు 'వన్‌సైడ్'గానే వుంటాయని పలు వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈసారి రాష్ట్రంలో ఎలాగైనా బోణీ కొట్టాలని భావిస్తున్న బీజేపీ.. తమ అభ్యర్థుల కోసం తీవ్రంగా శ్రమించింది. అన్నామలై, ఎల్.మురుగన్, పొన్ రాధాకృష్ణన్, తమిళిసై, నయినార్ నాగేంద్రన్‌లను లోక్‌సభకు రప్పించుకోవాలన్న ఉద్దేశంతో వారు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చేపట్టారని బీజేపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. దీంతో ఆ ఐదుగురు అభ్యర్థుల్లో ఎవరు లోక్‌సభకు వెళ్తారోనన్న ఉత్కంఠ నెలకొంది. దీంతో ఈ ఐదుగురిలో ఎవరు లోక్‌సభ మెట్లెక్కుతారన్న దానిపైనే ప్రధానంగా బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు?, 'ఇండియా' కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి? అన్నాడీఎంకే కూటమికి ఎన్ని స్థానాలు వస్తాయి? ఎన్‌డీఏ కూటమికి వచ్చే స్థానాలెన్ని, అందులో గెలిచే అభ్యర్థులెవరు? అన్న దానిపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. బెట్టింగులపై నిషేధం వున్నా పలువురు లోపాయికారీగా లక్షల్లో పందెం కాస్తున్నారు. యువతలో, రాజకీయాలపై ఆసక్తి వున్న ప్రముఖుల్లో ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ జరుగుతోంది. ఇందులో బీజేపీ సీనియర్ నేతలపైనే జోరుగా బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం. గతంలో బీజేపీ అభ్యర్థుల విజయంపై ఎన్నడూ పెద్దగా అంచనాలుండేవి కావు. అయితే ఈ సారి ప్రధానమంత్రితో పాటు కేంద్రమంత్రులు కూడా వరుసగా ప్రచారం చేయడం, కిందిస్థాయి నుంచి తీవ్రంగా కృషి చేయడం వంటి అంశాలతో బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడితో పాటు మాజీ అధ్యక్షుల విజయంపైనే అధికస్థాయిలో బెట్టింగులు సాగుతుండడం విశేషం.



తెల్లచీరలు ధరించిన హిజ్రాలు

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళి తెంచుకుంటున్న హిజ్రాలు

నేత్రపర్వంగా కూత్తాండవర్ రథోత్సవం

ప్యారీస్, ఏప్రిల్ 24: కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలోని కూవాగం గ్రామంలో బుధవారం ఉదయం కూత్తాండవర్ ఆలయ రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తులు రథం లాగి మొక్కులు చెల్లించుకున్నారు. కూత్తాండవర్ ఆలయ పూజారులచే మంగళవారం తాళి కట్టించుకున్న హిజ్రాలు బుధవారం రథోత్సవంలో పాల్గొని నృత్యాలతో సందడి చేశారు. ఆలయం ప్రధాన ప్రవేశద్వారం నుంచి కదిలిన రథం మళ్లీ మధ్యాహ్నం 2 గంటల సమయానికి ఆలయం వద్దకు చేరుకుంది. అప్పుడు తాళి తెంచుకున్న హిజ్రాలు బోరున విలపిస్తూ తమ కులదైవం కూత్తాండవర్ ముందు మొకరిల్లారు. ప్రతి ఏటా చైత్ర మాసంలో కూవాగం గ్రామంలో నిర్వహించే వేడుకల్లో వివిధ గ్రామాల ప్రజలతో పాటు దేశ, విదేశాలకు చెందిన హిజ్రాలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్న అంశాలతో స్వచ్ఛంద సేవా సంస్థలు హిజ్రాల కోసం విల్లుపురంలో రెండు రోజులు అందాల పోటీలు నిర్వహిస్తాయి. ఈ ఏడాది భారీస్థాయిలో తరలివచ్చిన హిజ్రాలతో కూవాగం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



పడమటి గాలుల్లో వైవిధ్యం

15 జిల్లాలకు

ఎల్లో అలెర్ట్

- హెచ్చరించిన వాతావరణ శాఖ
- వృద్ధులు ఇంటివద్దనే గడపాలని వైద్యుల సూచన

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పడమటి దిశ గాలుల్లో వైవిధ్యం కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయని, వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అంతేగాక రాష్ట్రంలోని 15 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో వేసవి ప్రారంభమైన తర్వాత గత వారం సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత పెరిగింది. దీంతో ఈ నెల గరిష్ఠ ఉష్ణోగ్రత 42.2 డిగ్రీల(108 ఫారెన్‌హీట్)కు పెరిగింది. ఫలితంగా 15 జిల్లాల్లోనూ వడగాడ్పులుంటాయని హెచ్చరించింది. రాష్ట్రంలోని 12 చోట్ల 40 డిగ్రీల (104 ఫా. డిగ్రీల) నుంచి 42.7 డిగ్రీల (109 డిగ్రీల) వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈరోడ్‌లో సాధారణం కంటే ఎండవేడి అధికంగా ఉంటోంది. తిరుపత్తూరు, కరూరు, పరమత్తివేలూరులో 42.7 సెల్సియస్ డిగ్రీల (109 ఫా. డిగ్రీల) ఉష్ణోగ్రత నమోదైంది. ధర్మపురిలో 41.1 డిగ్రీలు (106 ఫా. డిగ్రీలు), తిరుచ్చి, మదురై, కోయంబత్తూరు, నామక్కల్‌లో 40 డిగ్రీల సెల్సియస్ (104 ఫా. డిగ్రీల) నమోదయ్యాయి. తీర ప్రాంతాల్లో 35 డిగ్రీలు (95ఫా. డిగ్రీల నుండి) 37.2 డిగ్రీల సెల్సియస్‌గా (99ఫా. డిగ్రీలుగా) ఉంటోంది. అయితే చెన్నైలో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రతే నమోదైంది. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో పడమటి అంతర్గత జిల్లాల్లో సాధారణ స్థాయి కంటే 3 డిగ్రీలు నుండి 5 డిగ్రీల సెల్సియస్ దాకా ఉష్ణోగ్రత పెరుగుతుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. పగటి ఉష్ణోగ్రత 38.8 డిగ్రీల సెల్సియస్ (102ఫా. డిగ్రీల) నుండి 42 డిగ్రీల (108ఫా. డిగ్రీల) వరకు నమోదయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 27 వరకు ఈ ప్రాంతాల్లో ఎండవేడి అత్యధికంగా ఉంటుందన్నారు. ఇక బుధవారం తిరుప్పూరు, కరూరు, ఈరోడ్, నామక్కల్, సేలం, తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు, ధర్మపురి, కృష్ణగిరి, కళ్ళకురిచ్చి, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, వేలూరు, రాణిపేట జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ అయ్యింది. ఈ జిల్లాల్లో మరో మూడు రోజులపాటు పగటి ఉష్ణోగ్రత 100 డిగ్రీల నుంచి 102 (ఫా.డిగ్రీల) దాకా పెరిగే అవకాశాలున్నాయి. ఇక సముద్రతీర ప్రాంతాల్లో గాలిలో 50 నుంచి 85 శాతం దాకా తేమ ఉంటుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఎల్లో అలెర్ట్ జారీ కావటంతో వృద్ధులు మరో మూడు రోజుల పాటు ఇంటి పట్టునే ఉండాలని అధికారులు హెచ్చరించారు. నగరవాసులు అవసరమైతే తప్ప పగటిపూట ఎండల్లో తిరుగకూడదన్నారు. ఈ ఎండలో వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి నీళ్లు తాగాలని, తాటిముంజలు, పుచ్చకాయలు అధికంగా తీసుకోవాలని అధికారులు సూచించారు. ఎండలు తగ్గేంత వరకూ ఆహార పదార్థాలలో కారం తక్కువగా వాడితే మంచిదని, మజ్జిగ, పెరుగు ఎక్కువగా వాడాలని అధికారులు పేర్కొన్నారు. రెండు వారాల పాటు ప్రజలు అనవసరంగా ఎండల్లో సంచరించకుండా ఉండటమే మంచిదని సూచించారు.

అగ్నినక్షత్రం రాకముందే...

రాష్ట్రంలో అగ్ని నక్షత్రం ప్రారంభమయ్యే సమయంలో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగటం ఆనవాయితీ. ఈ యేడాది అగ్ని నక్షత్రం మే 4న ప్రారంభమై 28న ముగియనుంది. ఆ ఇరవై రోజులూ రాష్ట్రంలో ఎండలు భగ్గుమంటాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. అగ్నినక్షత్ర రాకముందే రాష్ట్రంలో ఎండలు విపరీతంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



మూడో స్థానంలో సేలం

దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతల్లో సేలం మూడవ స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో 108.14 డిగ్రీల ఫారిన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, వేలూరు, అరక్కోణం, తిరువళ్లూర్, చెన్నై, చెంగల్పట్టు, కళ్లకుర్చి, విల్లుపురం, మదురై తదితర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు మునుపటి కంటే బాగా పెరిగాయని, ప్రజలు అత్యవసర పనుల నిమిత్తమే బయటకు రావాలని పర్యావరణనిపుణులు సూచిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకి

తృతీయ స్థానమే

దినకరన్ జోస్యం



తిరుచెందూరు ఆలయంలో దైవదర్శనానికి వెళుతున్న టీటీవీ దినకరన్

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో అన్నాడీఎంకేకు తృతీయ స్థానమే దక్కుతుందని, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయేకి ద్వితీయ స్థానం లభిస్తుందని 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం' నేత టీటీవీ దినకరన్ జోస్యం చెప్పారు. చిత్రా పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆయన తిరుచెందూరు ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకేని కైవసం చేసుకున్న ఎడప్పాడి పళనిస్వామికి లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయం తప్పదన్నారు. ఎడప్పాడి నాలుగేళ్ల అసమర్థపాలన వల్లే గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమిపాలైందన్నారు. ప్రస్తుతం పార్టీకి ఏ మాత్రం సంబంధంలేని కొంతమంది వ్యక్తులను వెంటబెట్టుకుని ఎడప్పాడి పార్టీని నడుపుతున్నారని, భవిష్యత్తులో ఆ పార్టీ తమ సొంతమవుతుందని దినకరన్ వ్యాఖ్యానించారు.

మైనార్టీలకు మోదీ వ్యతిరేకం కాదు

● మాజీ గవర్నర్ తమిళిసై

ప్యారీస్, ఏప్రిల్ 24: ప్రధాని మోదీ మైనార్టీలను వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నేతలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పేర్కొన్నారు. కోవై విమానాశ్రయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో తొలివిడత లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఇందుకు ఎన్నికల కమిషన్‌ను అభినందించాలన్నారు. అయితే ఓటర్ల జాబితాలో లక్షలాది మంది పేర్లు లేవని, ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఓ బహిరంగసభలో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ చాలీసా వినడం కూడా నేరమేనని వ్యాఖ్యానించారని, ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రధానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. దేశంలో గృహిణుల సంక్షేమం కోసం దాదాపు 10 కోట్లకు పైగా ఉచిత గ్యాస్‌సిలిండర్లను కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిందని, అందులో సగానికి పైగా లబ్ధిపొందుతున్నది ఇస్లామీయులేనని చెప్పారు. దేశంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలను కేంద్ర ప్రభుత్వం సమానంగా భావిస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ మహిళా హక్కుల గురించి మాట్లాడుతున్నారని అయితే, ముస్లిం మహిళలు ఒంటరిగా హజ్ యాత్ర చేపట్టేందుకు ఆయన ఎటువంటి చర్యలు తీసుకోలేదని తమిళిసై విమర్శించారు.

ఎరువుల కర్మాగారాన్ని మూసివేయాలంటూ రాస్తారోకో: మాజీ మంత్రి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 24: మదురై జిల్లా కల్లికుడి పంచాయతీ పరిధిలోని చెన్నంపట్టి గ్రామంలో కేరళకు చెందిన ఎరువుల కర్మాగారాన్ని మూసివేయాలని కోరుతూ రాస్తారోకోలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ సహా అన్నాడీఎంకే కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన ఎరువుల కర్మాగారంలో మాంసం వ్యర్థాలు శుద్ధీకరించి ఎరువుగా తయారుచేస్తున్నారు. ఈ కర్మాగారం వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో పాటు పర్యావరణ కాలుష్యం దెబ్బతింటోందని, అందువల్ల ఆ కర్మాగారాన్ని మూసివేయాలని స్థానికులు కొన్నేళ్లుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. తమ డిమాండ్ పరిష్కరించని కారణంగా ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలను కూడా చెన్నంపట్టితో పాటు పరిసర గ్రామాల ప్రజలు బహిష్కరించారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా కలెక్టర్ నివేదిక కోరారు. దీనికి వివరణ ఇచ్చిన కాలుష్య నియంత్రణ బోర్డు, సంబంధిత కర్మాగారం చట్ట నిబంధనలకు లోబడే పనిచేస్తోందని తెలిపింది. ఈ నేపథ్యంలో, రైతులకు, ప్రజలకు నష్టం చేకూరుస్తున్న ఆ ఎరువుల కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ అసెంబ్లీ ప్రతిపక్ష ఉపనేత, స్థానిక ఎమ్మెల్యే ఆర్బీ ఉదయకుమార్ అధ్యక్షతన సుమారు 150 మందికి పైగా బుధవారం ఉదయం కల్లికుడి రహదారిలో రాస్తారోకోలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉదయకుమార్ మాట్లాడుతూ... చెన్నంపట్టి, సూరంపట్టి, పేయికులం తదితర 30 గ్రామాల ప్రజల కోరిక మేరకు కేరళ ఎరువుల ఫ్యాక్టరీని శాశ్వతంగా మూసివేయాలని జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు లేఖ రాసినా ఎటువంటి ఫలితం లేనందువల్లే తాము ప్రజలతో కలసి రాస్తారోకో చేపట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ పోలీసులు పలుమార్లు హెచ్చరించారు. అయినా ఆందోళన విరమించుకోకపోవడంతో 150 మందికి పైగా అరెస్ట్ చేశారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న అన్నాడీఎంకే నేతలు

సమాచార దర్శిని

చెన్నై-తడ మధ్య సిక్స్ వే

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: చెన్నై-తడ మధ్య ఏర్పాటైన ఆరులేన్ల రహదారి త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ జాతీయ రహదారి విస్తరణ పథకం రాష్ట్ర వాణిజ్యాభివృద్ధికి దోహదపడనుంది. అలాగే, ఆంధ్రలో ఉన్న తిరుపతి, శ్రీకాళహస్తి ఆలయాల సందర్శనకు వెళ్లే వారు ఈ రహదారిని వినియోగిస్తున్నారు. 54 కి.మీ ఫోర్ వేగా ఉన్న ఈ మార్గాన్ని సిక్స్ వేగా విస్తరించే పనులు 2009లో రూ.330 కోట్లతో ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 95 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.4 కి.మీ దూరం పనులు పూర్తి కావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

'నీట్' శిక్షణకు అనుమతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: వేసవి సెలవుల్లో పాఠశాలల్లో 'నీట్' శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అనుమతించిన పాఠశాల విద్యాశాఖ, ప్రత్యేక తరగతుల నిర్వహణపై నిషేధం విధించింది. విద్యార్థులకు జూన్ వరకు సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతి కోరారు. ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని, నీట్ శిక్షణ మాత్రమే ఇవ్వొచ్చని అధికారులు తెలిపారు.

380 మంది డ్రీమ్ టీచర్ల టూర్

ఐసిఎఫ్, ఏప్రిల్ 24 డ్రీమ్ టీచర్ పురస్కారగ్రహీతలు 380 మంది ప్రభుత్వ ఖర్చుతో విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో పర్యటనకు వెళ్లనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి పరచి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకొని ఆధునిక సాంకేతిక విధానంతో బోధన చేసే ఉపాధ్యాయులు 380 మందికి ఇటీవల డ్రీమ్ టీచర్ పురస్కారాలు అందజేశారు. వారిని ప్రోత్సహించేలా ఎడ్యుకేషన్ టూరిజాన్ని పాఠశాల విద్యాశాఖ ఏర్పాటుచేసింది. వీరు త్వరలో విదేశాలు, వివిధ రాష్ట్రాల్లో పర్యటించి మే 1వ తేదీకి రాష్ట్రానికి రానున్నారని అధికారులు తెలిపారు.

జూన్ 9న గ్రూప్-4 పోస్టుల రాతపరీక్ష సవరించిన టైంటేబుల్ విడుదల చేసిన టీఎన్‌పీఎస్సీ

పెరంబూర్, ఏప్రిల్ 24: గ్రూప్-1, గ్రూప్-2, 2ఏ, గ్రూప్ -4 తదితర పరీక్షల టైం టేబుల్‌ను టీఎన్‌పీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ఆ ప్రకారం 2024వ సంవత్సరానికి సవరించిన టైం టేబుల్ ప్రకటించారు. ఆ ప్రకారం, గ్రూప్-4 పరీక్ష జూన్ 9వ తేది జరుగనుంది. గ్రూప్-1 మెయిన్స్ జూలై 13న, గ్రూప్-2,2ఏ పరీక్ష సెప్టెంబరు 28వ తేది జరుగుతుందని ప్రకటించారు. కాగా, గ్రూప్-4 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ జనవరి 30వ తేది విడుదల చేశారు. అలాగే, గ్రూప్-1 మెయిన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ మార్చి 28వ తేది ప్రారంభమైంది. ఈ పరీక్ష దరఖాస్తుల సమర్పణ తుది గడువు ఈ నెల 27వ తేదిగా టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది.

29న ఉచిత వాలీబాల్ శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: నెల్లై ఫ్రెండ్స్ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో 40వ వార్షిక పాఠశాల విద్యార్థుల వేసవి ఉచిత వాలీబాల్ శిక్షణా శిబిరం ఈ నెల 29 నుంచి ప్రారంభం కానుంది. ఎగ్మూర్‌లోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో ఉన్న వాలీబాల్ మైదానంలో ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణలో 12 నుంచి 17 ఏళ్లలోపున్న బాలబాలికలు పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్న వారు 9382207524 అనే నెంబరు సంప్రదించాలని క్లబ్ కార్యదర్శి జగదీశన్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సులపై నిషేధం

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: గుర్తింపు పొందిన డిగ్రీ కోర్సుల పేరుతో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించరాదని విద్యాసంస్థలకు యూజీసీ హెచ్చరించింది. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి విడుదల చేసిన ప్రకటనలో... కొందరు వ్యక్తులు, సంస్థలు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నారని, వీరు తమ కోర్సుల పేరును ఇదివరకే గుర్తింపులో ఉన్న కోర్సులు తలపించేలా స్వల్ప మార్పులతో అందిస్తున్నారన్నారు. ఓ సంస్థ పదిరోజుల్లో ఎంబీఏ పేరుతో ఆన్‌లైన్ కోర్సులు ప్రకటించడం యూజీసీ దృష్టికొచ్చిందని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి కోర్సులను అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ అనుమతి పొందకుండా సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు విద్యాసంస్థలను హెచ్చరించారు.

పెరిగిన ఏసీ విక్రయాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: రాష్ట్రంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేలా పలువురు ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో వాటి విక్రయాలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. ఈ విషయమై ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయదారులు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో షోరూమ్‌లో నెలకు 100 ఏసీలు విక్రయమవుతున్నాయని, చిన్న గదులుండే వారు టన్ను సామర్థ్యం,పెద్ద గదులుండే వారు 1.5 టన్నుల సామర్థ్యం కలిగిన 3 స్టార్, 5 స్టార్ ఏసీలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

రాష్ట్రేతర ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వెళ్లే రాష్ట్రేతర ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ కార్మికుల సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. లోక్‌సభ ఎన్నికలు ఏడు విడతలుగా జరుగుతున్నాయి. తొలివిడతలో తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఈ నెల 19వ తేది పోలింగ్ జరుగ్గా, రెండో విడతలో కేరళలో 26వ తేది, కర్నాటకలో ఈ నెల 26 (మొదటి విడత), మే 7 (రెండవ విడత) పోలింగ్ జరుగనుంది. ఆంధ్రలో మే 13వ తేది లోక్‌సభ ఎన్నికలతో పాటు శాసనసభ ఎన్నికలకు పోలింగ్ జరుగనుంది.ఈ రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగిన ఓటర్లకు వేతనంతో కూడిన సెలవును ఇవ్వనున్నట్లు కార్మికుల సంక్షేమ శాఖ తెలిపింది.

బాడీ బిల్డింగ్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 24: తమిళన్ బాడీ బిల్డర్-వేలూరు, జిల్లా అమెచ్యూర్ బాడీ బిల్డర్, ఫిట్‌నెస్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గుడియాత్తంలో బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఇండియన్ రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇరాశి దళిత్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రంగావాసుదేవన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అళగు ఫిట్‌నెస్ యజమాని రజనీకాంత్ సహా ప్రముఖులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ తనిఖీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: గృహాల్లో వంటగ్యాస్ సిలిండర్ తనిఖీ ఉచితంగా చేపట్టేలా సౌకర్యం కల్పిస్తూ ఆయిల్ కంపెనీలు ఉత్తర్వులు జారీచేశాయి. ఇండియన్ ఆయిల్, భారత్, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు గృహాలు, వాణిజ్య వినియోగాలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నాయి. ఐదేళ్లకు ఒకసారి సిలెండర్‌లో ఉన్న రబ్బర్ ట్యూబ్ మార్చడంతో పాటు రెగ్యులేటర్ పనితీరు అప్పుడప్పుడూ తనిఖీ చేస్తుండాలి. ఏజెన్సీ ఉద్యోగులు ఈ తనిఖీలకు రూ.200 ఛార్జీలు వసూలుచేస్తున్నారు. ఇకపై ఈ తనిఖీలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, సిలిండర్ డెలివరీ చేసే ఉద్యోగులు ఉచితంగా వీటిని తనిఖీ చేస్తారని ఆయిల్ సంస్థలు వెల్లడించాయి.

ఆవిన్‌లో జోరుగా మజ్జిగ విక్రయాలు

ప్యారీస్, ఏప్రిల్ 24: భానుడి ప్రతాపం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో, రాజధాని నగరంలో ఆవిన్ సంస్థలో మజ్జిగ విక్రయాలు పెరిగాయి. బాటిల్ మజ్జిగ (200 మి.లీ) రూ.12, ప్యాకెట్ మజ్జిగ (220 మి.లీ) రూ.8కి అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో పాల ఉత్పత్తులు, పాలకు సంబంధించిన పదార్థాల విక్రయంలో రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని ఆవిన్ సంస్థ లాభాల బాటలో పయనిస్తోంది. రోజుకు సుమారు 26 లక్షల లీటర్లపై పైగా రైతుల నుంచి పాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో ఆవిన్ మజ్జిగ, పెరుగు, లస్సీ, ఐస్‌క్రీమ్ తదితర విక్రయాలు ఊపందుకున్నాయి.

రంగనాథస్వామి హుండీ ఆదాయం రూ.70 లక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 24: తిరుచ్చి శ్రీరంగం రంగనాథస్వామి హుండీ ఆదాయం రూ.70.3 లక్షలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయానికి రాష్ట్రం సహా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. అలా భక్తులు హుండీల్లో సమర్పించే కానుకలను ప్రతి నెలా చివరి వారంలో లెక్కిస్తుంటారు. ఆప్రకారం, ఈనెలకు సంబంధించిన హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.70.3 లక్షల నగదు, 125గ్రాముల బంగారం, 775 గ్రాముల వెండి, 280 విదేశీ కరెన్సీ సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

28కి మంత్రి పొన్ముడి క్వారీ కేసు వాయిదా

పెరంబూర్, ఏప్రిల్ 24: మంత్రి పొన్ముడిపై నమోదైన కేసు విచారణ ఈ నెల 29వ తేదీకి వాయిదాపడింది. విల్లుపురం జిల్లా వానూర్ తాలూకా పుత్తురై గ్రామంలోని క్వారీలో అనుమతులకు మించి ఎర్రమట్టి తీసి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించారని మంత్రి పొన్ముడి సహా 8 మందిపై 2012లో జిల్లా నేర విభాగం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు విచారణ విల్లుపురం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో సాగుతోంది. ఈ కేసులో నేరారోపణ ఎదుర్కొంటున్న లోకనాధన్ అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. ఈ కేసులో 67 మంది ప్రభుత్వ తరఫు సాక్ష్యులుండగా, వారిలో ఇప్పటివరకు 26 మంది సాక్ష్యం అందించిన నేపథ్యంలో, 22 మంది ప్రభుత్వానికి ప్రతికూలకంగా వాంగ్మూలిమిచ్చారు. మిగిలిన సాక్ష్యుల విచారణ బుధవారం జరిగింది. విచారణకు జయచంద్రన్, సదానందం, గోపినాద్, కోతకుమార్ తదితరులు హాజరయ్యారు. అలాగే, మంత్రి పొన్ముడి, ఎంపీ గౌతమ్ శిఖామణి, రాజమహేంద్రన్ హాజరుకాలేదు. వారు హాజరుకాకపోవడానికి గల కారణాలను డీఎంకే న్యాయవాదులు పిటిషన్ దాఖలుచేశారు. దీంతో, ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 29వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి (ఇన్‌ఛార్జి) హెర్మిస్ ఉత్తర్వులు జారీచేశారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 24: వేసవి సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి చెన్నై ఎగ్మూర్, బెంగళూరుకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.08557 విశాఖపట్టణం-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక సమ్మర్ స్పెషల్ ఈనెల 27, మే 4,11,18,25, జూన్ 1,8,15,22,29 తేదీల్లో విశాఖపట్నం నుంచి రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.08558 చెన్నై ఎగ్మూర్-విశాఖపట్నం ప్రత్యేక సమ్మర్ స్పెషల్ ఈ నెల 28, మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30 తేదీల్లో చెన్నై ఎగ్మూర్ నుంచి ఉదయం 10.30 గంటలకు బయల్దేరి రాత్రి 10.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

● నెం.08549 విశాఖపట్నం- బెంగళూరు వారాంతపు ప్రత్యేక రైలు (రేణిగుంట-కాట్పాడి-జోలార్‌పేట మీదుగా) ఈ నెల 27, మే 4,11,18,25, జూన్ 1,8,15,22,29 తేదీల్లో విశాఖపట్నంలో మధ్యాహ్నం 1.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.08550 బెంగళూరు-విశాఖపట్నం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 28, మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30 తేదీల్లో బెంగళూరు నుంచి ఉదయం 8.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

తాంబరం-ఈరోడ్-ధన్‌బాద్ ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 24: ఈరోడ్-జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్, తాంబరం-ధన్‌బాద్ వేసవి ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఈరోడ్ నుంచి ఈ నెల 26, మే 3,10,17,24,31, జూన్ 7,14,21,28 తేదీల్లో మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి మూడో రోజు ధన్‌బాద్‌కు ఉదయం 8.30 గంటలకు చేరనుంది. ధన్‌బాద్ నుంచి ఈ నెల 29, మే 6,13,20,27, జూన్ 3,10,17,24, జూలై 1 తేదీల్లో ఉదయం 6 గంటలకు బయల్దేరే రైలు మూడో రోజు వేకువజామున 2 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. తాంబరం నుంచి ఈనెల 28, మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30 తేదీల్లో సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరే రైలు మూడో రోజు ఉదయం 8.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ధన్‌బాద్ నుంచి మే 1,8,15,22,29, జూన్ 5,12,19,26, జూలై 3 తేదీల్లో ఉదయం 6 గంటలకు బయల్దేరే రైలు మూడవ రోజు రాత్రి 10.45 గంటలకు తాంబరం వచ్చి చేరుతుంది. ఈ రైళ్ల రిజర్వేషన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి.

ప్రధాని మోదీపై చర్యలు తీసుకోవాలి

● ఈసీకి ఎస్‌డీపీఐ ఫిర్యాదు

అడయార్, ఏప్రిల్ 24: ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమయంలో రాజకీయ లబ్ధిపొందే కుట్రలో భాగంగా మైనార్టీల (ముస్లి)ను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు దేశంలో పెనుదుమారాన్ని రేపాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌డీపీఐ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం మోదీ తన పదవిని కూడా విస్మరించి దేశంలోని మైనార్టీలపై విషం చిమ్మారని ఆ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ప్రాథమిక న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన ప్రధాని మోదీపై చర్యలు తీసుకోవాలని వారు ఈసీకి సమర్పించిన ఫిర్యాదు లేఖలో పేర్కొన్నారు.

లేడీ కానిస్టేబుల్‌కు బెదిరింపులు

● మహిళా ఖైదీ అరెస్టు

అడయార్, ఏప్రిల్ 24: స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను కిందపడేసి హత్యా బెదిరింపులకు పాల్పడిన మహిళా ఖైదీని పోలీసులు అరెస్టు చేశారు. ఆమెపై మూడు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ జైలులో విధులు నిర్వహిస్తున్న శశికళ అనే మహిళా కానిస్టేబుల్ మహిళా ఖైదీలందరినీ సాయంత్రం 6 గంటల తర్వాత తమతమ గదుల్లోకి వెళ్లాలని సూచించారు. ఆ సమయంలో గదిలో విశ్రాంతి తీసుకుంటున్న సలీమా అనే మహిళా ఖైదీ కానిస్టేబుల్ శశికళతో వాగ్వాదానికి దిగింది. ఈక్రమంలో వారిద్దరి మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఆ సమయంలో శశికళను కిందపడేసిన సలీమా.. హత్య చేస్తానని బెదిరించింది. దీంతో శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సలీమాను అరెస్టు చేశారు. ఈ సంఘటన పుళల్ జైలులో చర్చనీయాంశంగా మారింది.

భార్య చూస్తుండగానే ఉరేసుకున్న బ్యాంకు మేనేజర్

అడయార్, ఏప్రిల్ 24: కట్టుకున్న భార్య కళ్లెదుటే ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్ ఉరేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన సేలం జిల్లా తొలసంపట్టి సమీపంలో జరిగింది. ఓలైపట్టి గ్రామానికి చెందిన ఇళవరసన్ (38) ధర్మపురి జిల్లా పెన్నాగరంలో ఉన్న ఒక ప్రైవేటు బ్యాంకులో మేనేజరుగా పని చేస్తున్నారు. ఈయనకు భార్య శోభన, ముగ్గురు పిల్లలున్నారు. గత రెండు వారాలుగా బ్యాంకు రెండు శాఖలకు మేనేజరుగా విధులు నిర్వహించిన ఇళవరసన్ పని ఒత్తిడి అధికమైనట్టు భార్యవద్ద వాపోయాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రాత్రి 11.30 గంటల సమయంలో తన నివాసంలోని పడక గదికి వెళ్ళిన ఇళవరసన్ తలుపులు వేసుకుని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు భార్యకు చెప్పడమే కాకుండా అన్నంత పనిచేశాడు. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నీట మునిగి ముగ్గురు బాలుర మృతి

పెరంబూర్, ఏప్రిల్ 24: కోయంబత్తూర్ జిల్లాలో నీట మునిగి ముగ్గురు బాలురు మృతిచెందారు. ఆనమలై సమీపంలోని ఆళియార్ పార్క్, మంకీ ఫాల్స్, అరివుత్తిరుకోయిల్, వాల్పారై తదితర పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్తుంటారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో మంకీ ఫాల్స్ వద్ద నీటి ఉధృతి తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో, ఆ ప్రాంతంలో బుధవారం సాయంత్రం స్నానం చేసేందుకు వెళ్లిన ప్రవీణ్ (17), దక్షణ్ (17), కవీన్ (16) హఠాత్తుగా లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని ముగ్గురి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

600 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

అడయార్, ఏప్రిల్ 24: స్థానిక కొరుకుపేట నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా రైలులో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 600 కేజీల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొరుకుపేట రైల్వే స్టేషన్‌లోని నాలుగో నెంబర్ ప్లాట్‌ఫారంపై రేషన్ బియ్యం బస్తాలుంచి, వాటిని ఆంధ్రకు అక్రమంగా తరలించనున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ శశికళ సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకుని 25 బస్తాల్లో ఉన్న 600 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని ఆంధ్రకు తరలించేందుకు సిద్ధం చేసిన స్మగ్లర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రభుత్వ బస్సులో రూ.15 లక్షలు స్వాధీనం

పెరంబూర్,ఏప్రిల్24:నాగపట్టణంలో ప్రభుత్వబస్సుల్లో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి రూ.15లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మేల్‌వంజూరులో ఉన్న చెక్‌పోస్ట్‌లో వాహనతనిఖీలు చేపట్టిన పోలీసులు,ట్రిప్లికేన్‌కు చెందిన సుకర్నో అనే వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. వేదారణ్యంకు చెందిన వ్యక్తికి ఈ నగదు అందించేందుకు వెళ్తున్నానని సుకర్నో చెప్పడంతో, పోలీసులు అతడిని పిలిపించి విచారిస్తున్నారు.

బస్సు బోల్తాపడి మహిళ మృతి

● 25మందికి గాయాలు



చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా అయ్యంపేట ప్రైవేటు కళాశాల సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా 25 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బుధవారం ఉదయం కుంభకోణం నుంచి తంజావూరుకు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రభుత్వ రవాణా సంస్థ బస్సు అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న పంటకాల్వలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తంజావూరుకు చెందిన లక్ష్మి (50) అనే మహిళ మృతిచెందింది. బస్సులో ప్రయాణించిన 25 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

అంబేడ్కర్ విగ్రహంపై బాంబు దాడి

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కుల్లంచావిడి సమీపం అంబలవానన్‌పేట గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులతో దాడి జరిపారు. రెండు బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు ఆ విగ్రహంపై పెట్రోలు బాంబులతో దాడి చేసి పారిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. కుల్లంచావిడి పోలీసుల కేసు నమోదు చేసుకుని నలుగురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కడలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తామరై సెల్వన్ నాయకత్వంలో స్థానికులు ఆ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఇదే విధంగా డీపీఐకి చెందిన వందమంది కార్యకర్తలు నిరసన ప్రదర్శన జరిపారు. ఆ తర్వాత అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఐ నేతలు మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోలు బాంబు విసిరిన దుండగలను గుండా చట్టం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న డీపీఐ నేతలు, కార్యకర్తలు

ఐపీఎల్ టిక్కెట్లు విక్రయించిన 12 మంది అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 24: ఐపీఎల్ పోటీల్లో భాగంగా చేపాక్కం మైదానంలో మంగళవారం రాత్రి చెన్నై సూపర్ కింగ్స్-లక్నో సూపర్ జైంట్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం ఆన్‌లైన్‌లో ప్రారంభమైన 10 నిమిషాల్లోపే అయిపోయాయి. టిక్కెట్లు లభించని అభిమానులు ఎలాగైనా మ్యాచ్ చూడాలని స్టేడియం వద్దకు చేరుకున్నారు. వారి ఆసక్తిని గమనించి పలువురు అధిక ధరలకు టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంలో పోలీసులు తనిఖీచేసి బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న 12 మందిని అరెస్ట్ చేసి, 56 టిక్కెట్లు, రూ.1,40,396 నగదు స్వాధీనం చేసుకున్నారు.

బావిలో మునిగి అక్కాతమ్ముళ్ల మృతి

పెరంబూర్, ఏప్రిల్ 24: బావిలో మునిగి అక్కా, తమ్ముడు మృతిచెందిన ఘటన కళ్లకుర్చి జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. తిరుకోవిలూర్ సమీపం జంపై గ్రామానికి చెందిన సుబ్బులక్ష్మి (12), తమ్ముడు కార్తీక్ (11)తో కలసి అదే ప్రాంతంలోని దిగుడు బావిలో స్నానం చేసేందుకు దిగారు, ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగిపోయారు. చుట్టుపక్కల వారిచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన అక్కా, తమ్ముడు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రబ్బరు తోటలో పులి కళేబరం

పెరంబూర్, ఏప్రిల్ 24: కన్నియాకుమారి జిల్లా కులశేఖరం కాకచ్చన్‌లోని ఓ ఆలయ సమీపంలో ఇద్దరిపై దాడిచేసిన పులి, అదే ప్రాంతంలోని రబ్బరు తోటలో మృతిచెంది కనిపించింది. పులి కళేబరాన్ని పరిశీలించి పశు వైద్యులు, పులికి 15 ఏళ్లు ఉంటాయని, ముళ్ల పందిని వేటాడే సమయంలో పులి శరీరంలో పలు ప్రాంతాల్లో ముళ్లు గుచ్చుకొని మృతిచెందినట్లు నిర్ధారించారు.

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

పెరంబూర్, ఏప్రిల్ 24: స్థానిక మణిమంగళం సమీపంలో మహావీర్ జయంతి రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని బెదిరించిన పోలీసులు, వారి నుంచి రూ.24,000 లాక్కున్నట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ చేపట్టిన నగర పోలీసుల శాఖ శంకర్, గణేష్‌సింగ్, ఆనంద్‌రాజ్ అనే ముగ్గురిని సస్పెండ్ చేసింది. వీరిపై అందిన పలు ఫిర్యాదులపై కూడా విచారణ చేపట్టినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

ఇంజనీర్ ఇంట్లో కిలో గంజాయి స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 24: స్థానిక చూలైమేడులో ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గదిలో కిలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శక్తినగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న షర్మిల అనే ఇంజనీర్ గదిలో గంజాయి ఉన్నట్లు అందిన సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి, కిలో గంజాయి స్వాధీనం చేసుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కానీ, ఈ ప్యాకెట్ తన స్నేహితుడు సురేష్ ఇచ్చి ఇంట్లో భద్రపరచమని చెప్పారని, అందులో గంజాయి ఉన్నట్లు తనకు తెలియదని షర్మిల పోలీసులకు వివరించింది. ఈ వ్యవహారంలో సురేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

ప్రభుత్వ బస్సులో మహిళల నిరాకరణ

● డ్రైవర్, కండక్టర్ సస్పెన్షన్

పెరంబూర్, ఏప్రిల్ 24: విల్లుపురంలో ప్రభుత్వ బస్సులో మహిళలను ఎక్కించుకొనేందుకు నిరాకరించిన డ్రైవర్, కండక్టర్లపై సస్పెన్షన్ వేటుపడింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే ఫైలుపై ముఖ్యమంత్రి స్టాలిన్ సంతకం చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం, ప్రస్తుతం బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో, విల్లుపురం అన్నామలై హోటల్ సమీపంలోని బస్టాండ్‌లో నిల్చున్న మహిళలను ఎక్కించుకోకుండా బస్సు వెళ్లినట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అధికారులు, బస్సు డ్రైవర్ ఆర్ముగం, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కండక్టర్ దేవరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఏటీఎం కేంద్రంలో చోరీ యత్నం.. ఒకరి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 24: స్థానిక రెడ్‌హిల్స్‌లో ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ప్రాంతంలోని ప్రైవేట్ బ్యాంక్ కేంద్రంలో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి ప్రవేశించి ఏటీఎం మెషీన్‌ను రాయితో బద్దలుకొడుతున్న దృశ్యాలను సీసీ టీవీ ద్వారా పర్యవేక్షించిన బ్యాంక్ అధికారి పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు సత్వరం అక్కడకు చేరుకొని ఏటీఎం మెషీన్ బద్దలుకొట్టేందుకు యత్నించిన అలెగ్జాండర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో ఈ చర్యలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు తెలిసింది.

కారు బోల్తా

● మహిళా అధికారి సహా ఇద్దరు మృతి

ప్యారీస్, ఏప్రిల్ 24: విరుదునగర్ జిల్లా మనప్పారై సమీపంలో కారు బోల్తాపడిన ఘటనలో ప్రభుత్వ మహిళా అధికారి సహా ఇద్దరు మృతిచెందారు. తిరుచ్చి వెంకటేశ్వర నగర్ విస్తరణ పథకం ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న విజయలక్ష్మి (51), ఆమె తన భర్త గోపి (55), బంధువు కన్నన్ (47)తో కలసి కారులో విరుదునగర్ జిల్లా శివకాశిలో జరిగిన వివాహ కార్యక్రమానికి బయల్దేరి వెళ్లారు. ఆ కారు శివకాశి సమీపంలోని కల్లుపట్టి ప్రాంతానికి చేరుకున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తాపడింది. ఈ ఘటనలో విజయలక్ష్మి, కన్నన్ సంఘటనా స్థలంలోనే మరణించగా, గాయపడిన గోపిని ద్వారంకుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

వేలూరు, ఏప్రిల్ 24: పేర్నాంబట్టు కొత్తపల్లి గ్రామం లో చిన్న పెంకుటింట్లో నివసించే అనిత-తిరుపతి దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. మద్యానికి బానిసైన తిరుపతి సంపాదించిన సొమ్మంతా తా గుడికేవెచ్చిస్తూ కుటుంబాన్ని సక్రమంగా పోషించడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో, ఆయన కుమారుడు, కుమార్తెలు కొత్తపల్లి నుంచి పేర్నాంబట్టు వరకు సుమారు 4 కి.మీ నడిచి పాఠశాలకు వెళుతున్నారు. ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో, ఆటోలో వెళ్లే ఆర్థికస్తోమత వారికి లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శవరణన్ వారికి సైకిల్ ఉచితంగా అందజేశారు. దినేష్‌ను పలువురు అభినందించారు.

టెక్నీషియన్ల సామూహిక సెలవు

● బోసిపోయిన ఆర్టీఏ కార్యాలయాలు



ప్యారీస్, ఏప్రిల్ 24: రాష్ట్రప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్లు బుధవారం సామూహిక సెలవు పెట్టడంతో అన్ని సేవలు స్తంభించాయి. ఇటీవల రాష్ట్రప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో... పోస్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, వాహన రిజిస్ట్రేషన్, వాహన యజమానుల పేరు మార్పు, చిరునామా మార్పు తదితర అన్నిరకాల సేవలకు అనుమతిచ్చింది. ఈ మార్పుల కారణంగా ఆర్టీఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పనిభారం పెరగడంతో పాటు పోస్టల్ శాఖ వల్ల కలిగే ఆలస్యంతో ప్రజల్లో ఆర్టీఏ కార్యాలయాలపై నమ్మకం సన్నగిల్లింది. ఈ కొత్త విధానాన్ని పరిశీలించి గతంలాగే సేవలు కొనసాగించాలని ఆర్టీఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 3,000లకు పైగా ఉన్న ఆర్టీఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఒకరోజు సమ్మెకు పిలుపిచ్చారు. ఆ మేరకు నగరంలోని కొళత్తూర్, గిండి, బేసిన్ బ్రిడ్జి, తండయార్‌పేట తదితర ప్రాంతాల్లో ఉన్న ఆర్టీఏ కార్యాలయాలు సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో విధులు బహిష్కరించిన ఉద్యోగులు, తమ కోర్కెలు నెరవేర్చాలంటూ నిరసన వ్యక్తం చేశారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మజ్జిగ, పుచ్చకాయల పంపిణీ

వేలూరు, ఏప్రిల్ 24: ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం కాట్పాడి డివిజన్, వేలూరు మనిదనేయ కేంద్రం సంయుక్తంగా ప్రజలకు మజ్జిగ, పుచ్చకాయలు అందజేశారు. జిల్లాల్లో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంది. విధులు, ఇతరత్రా కార్యక్రమాలకు వెళ్లే వారు ఎండలో తిరగలేక అల్లాడుతున్నారు. ఈ క్రమంలో, ప్రజలకు ఎండ ుంచి ఉపశమనం కలిగించేందుకు స్థానిక ఉపాధ్యాయ హోం సమీపంలో బుధవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి రెడ్‌క్రాస్ కాట్పాడి డివిజన్ అవైె అధ్యక్షుడు జనార్ధనన్ అధ్యక్షత వహించగా, వేలూరు మనిదనేత కేంద్రం జనరల్ సెక్రటరీ కరుణానిధి, రెడ్‌క్రాస్ కాట్పాడి జనరల్ సెక్రటరీ సెల్వముత్తు, ఉపాధ్యక్షులు కుమరన్, శ్రీనివాసన్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ప్రజలకు నీరు, మజ్జిగ, పుచ్చకాయలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అరుణ్ విజయ్ కొత్తం చిత్రం

'రెట్ట తల'



అరుణ్ విజయ్ వరుస చిత్రాలను అంగీకరిస్తున్నారు. ప్రస్తుతం బాలా దర్శకత్వంలో 'వణంగాన్' చిత్రంలో నటించిన ఆయన.. తాజాగా మరో కొత్త చిత్రం చేసేందుకు అంగీకరించారు. ఈ చిత్రానికి 'రెట్ట తల' అనే పేరు ఖరారు చేశారు. ఇందులో అరుణ్ విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. దాని టైటిల్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమం నగరంలో జరిగింది. ఇందులో చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు, చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు. ఇది అరుణ్ విజయ్ 36వ చిత్రం. బాబీ బాలచంద్రన్ సమర్పణలో బీటీజీ యూనివర్శల్ ఫిలిమ్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనుంది. క్రిస్ తిరుకుమరన్ దర్శకుడు. తాన్య రవిచంద్రన్, సిద్ధి ఇద్నానీ హీరోయిన్లు. శ్యామ్ సీఎస్ సంగీతం. 'రెట్ట తల' అనే టైటిల్ ఖరారు చేసిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్ రిలీజ్ చేయగా, ఇందులో అరుణ్ విజయ్‌లు ఆక్రోశంగా తలపడుతున్నారు.

మహిళల నెలసరి నేపథ్యంలో ప్రత్యేక ఆల్బమ్



కొన్ని సామాజిక వర్గాల్లో బహిష్టు సమయంలో స్త్రీలను ఇంటికి దూరంగా ఉంచడం ఎంతవరకు న్యాయం అనే అంశాన్ని ప్రధానాంశంగా తీసుకుని నవీన్ లక్ష్మణ్ దర్శకత్వంలో ఒక ప్రత్యేక ఆల్బమ్ రూపొందించారు. దివంగత మాజీ నేత తందై పెరియార్ స్త్రీల పురోగతి కోసం, విముక్తి కోసం ఎంతగానో కృషి చేశారు. ఒక వ్యక్తిని మరో వ్యక్తిని కులం ఆధారంగా వేరు చేయడాన్ని అంటరానితనంగా భావిస్తే, ఒక స్త్రీని బహిష్టు సమయంలో ఇంటికి, సమాజానికి దూరంగా ఉంచడం కూడా అంటరానితనంతో సమానమని తందై పెరియార్ చెప్పేవారని దర్శకుడు నవీన్ లక్ష్మణ్ గుర్తు చేస్తున్నారు. ఈ అంశాన్ని ప్రధానాంశంగా చేసుకుని ఆల్బమ్‌ను రూపొందించినట్టు తెలిపారు. దీనిపై ఆయన మాట్లాడుతూ, దీనికి 'తీట్టు' అని పేరు పెట్టాం. మన పూర్వీకుల్లో కొందరు మేధావులు బహిష్టు సమయంలో వారి శరీరంలో జరిగే మార్పులు, నీరసం అలసట వంటి వాటి నుంచి కొంతమేరకు ఉపశమనం పొందేందుకు వీలుగా విశ్రాంతి పేరుతో పీరియడ్స్ సమయంలో ఇంటికి దూరంగా ఉంచేశారు. దీన్ని కొందరు అపార్థం చేసుకుని అపవిత్రతను అంటగట్టారు. ఆ సమయంలో స్త్రీలను అంటరానివారిగా పరిగణించి ఇంటికి దూరంగా ఉంచుతున్నారు. యుగయుగాలుగా ఇది కొనసాగుతుంది. ఈ విషయంపై పురుషుల్లో అవగాహన కల్పించేందుకు ఆదేష్ బాలా, రతి జంటగా ఈ ఆల్బమ్‌ను రూపొందించాం. త్వరలోనే ఈ ఆల్బమ్‌ను రిలీజ్ చేస్తాం'. అని వెల్లడించారు.

ఇళయరాజాకు రాయల్టీపై మాత్రమే హక్కు

- మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఉండే సంగీత దర్శకులు ఒక సినిమాకు ఆ చిత్ర నిర్మాత నుంచి రెమ్యునరేషన్ తీసుకున్న తర్వాత రాయల్టీ పొందే హక్కు మినహా మిగిలిన హక్కులను కోల్పోతారని మద్రాసు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. కాపీ రైట్స్ చట్ట ప్రకారం పాటల యజమానిగా ఇళయరాజా వస్తారా? లేదా? అనేది తదుపరి విచారణలో నిర్ణయిస్తామని ధర్మాసనం పేర్కొంది. సంగీత దర్శకుడు ఇళయరాజా సమకూర్చిన పాటల్లో సుమారుగా 4500 పాటలను ఉపయోగించుకునేందుకు ఎకో ఆడియో రికార్డింగ్ కంపెనీ అనుమతి పొందింది. అయితే, ఈ అనుమతులు పూర్తయినప్పటికీ ఆ కంపెనీ పాటలను ఉపయోగిస్తుంది. దీంతో తన పాటలకు కాపీ రైట్స్ తీసుకోకుండా ఉపయోగిస్తున్నారంటూ ఇళయరాజా హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. నిర్మాతల అనుమతి తీసుకున్న తర్వాత ఇళయరాజా పాటలను ఉపయోగించుకునేందుకు ఆడియో కంపెనీలకు పూర్తి హక్కులున్నాయంటూ తీర్పునిచ్చారు. అదేసమయంలో ఈ పాటలపై ఇళయరాజాకు ధార్మికంగా ప్రత్యేక హక్కులు ఉన్నాయంటూ 2019లో ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో అప్పీల్ చేయగా, ఎంపిక చేసిన 4500 పాటలను ఉపయోగించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, సినిమా కాపీ రైట్ హక్కులు నిర్మాత వద్ద ఉన్న కారణంగా ఆయా చిత్రాల్లోని పాటలను ఉపయోగించుకునేందుకు తమకు అధికారం ఉందని పేర్కొంటూ ఎకో కంపెనీ హైకోర్టుకు తెలిపింది. ఈ

చిత్రజ్యోతి

కేసు విచారణ బుధవారం మరోమారు జరిగింది. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తులు మహాదేవన్, మహ్మద్ సఫీక్‌లతో కూడిన ధర్మాసనం.. 'గీత రచన, నేపథ్యగాయకుడు కలిస్తేనే పాటగా రూపాంతరం చెందుతుంది. సాహిత్యం లేకుంటే పాట లేదు. ఈ కోణంలో ఆలోచిస్తే గేయ రచయిత కూడా ఆ పాటకు రైట్స్ కోరితే పరిస్థితి ఏంటి? భారతీయ చిత్రపరిశ్రమలో ఒక చిత్రానికి ఆ చిత్ర నిర్మాత నుంచి రెమ్యునరేషన్ తీసుకున్న తర్వాత అన్ని హక్కులు కోల్పోతారని, కేవలం రాయల్టీపై మాత్రమే హక్కుగా ఉంటుందని స్పష్టం చేశారు. పైగా ఈ పాటల విక్రయం ద్వారా ఇళయరాజా పొందిన సొమ్ము ఎవరికి సొంతం అనే విషయాన్ని తర్వాతి విచారణలో వెల్లడిస్తామంటూ ఈ కేసు తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి ద్విసభ్య ధర్మాసనం వాయిదా వేసింది.

నడిగర్ సంఘానికి ఎస్కే విరాళం



దక్షిణ భారత నడిగర్ సంఘం భవన నిర్మాణ పనుల కోసం హీరో శివకార్తికేయన్ తన వంతుగా రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ విషయాన్ని నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 'దక్షిణ భారత నడిగర్ సంఘం సభ్యుడైన శివకార్తికేయన్ నడిగర్ సంఘం భవన నిర్మాణ పనుల కోసం రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో నడిగర్ సంఘం కోశాధికారి హీరో కార్తీకి ఆయన అందజేశారన్నారు. ఈ సందర్భంగా శివకార్తికేయన్‌కు నడిగర్ సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు నాజర విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, రజినీకాంత్, కమల్ హాసన్ వంటి పలువురు అగ్ర హీరోలు తమ వంతుగా కొంత మొత్తం విరాళం ఇచ్చిన విషయం తెల్సిందే.



వండియూరు వీరరాఘవపెరుమాళ్ ఆలయంలో విశేషాలంకారంలో, శేషవాహనంపై కళ్ళలగర్

స్వక్షేత్రానికి కళ్ళలగర్ పయనం

... ఘనంగా మదురై వాసుల వీడ్కోలు

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మదురైలో వైగైనదిలో సుమారు పది లక్షల మంది భక్తులకు దివ్యదర్శనమిచ్చిన కళ్ళలగర్‌స్వామి మంగళవారం మధ్యాహ్నం అక్కడి నుండి బయలుదేరి మదిచ్చియం రామరాయర్ మండపంలో కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ఆ సమయంలో కళ్ళలగర్ వేషాలు ధరించిన భక్తులు స్వామివారిపై పన్నీటిని చల్లారు. ఆ తర్వాత రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వండియూర వీరరాఘవ పెరుమాళ్ ఆలయానికి చేరుకుని మండపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ఉదయం తిరుమంజనం అనంతరం స్వామివారికి ఏకాంత సేవ, శాంతి కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత కళ్ళలగర్‌స్వామి శేషవాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆ సమయంలో వేలాదిమంది భక్తులు చక్కెర దీపాలతో స్వామివారిని మొక్కారు. ఆ తర్వాత అక్కడి నుంచిబయలుదేరిన కళ్ళలగర్ తేనూరు మండపానికి చేరుకున్నారు. అక్కడ గరుడవాహనంలో భక్తులకు దర్శనమివ్వగా, మండూక మహర్షికి శాపవిమోచనం కలిగించిన ఘట్టం నిర్వహించారు. కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆంజనేయ స్వామివారి ఆలయంలో కొలువుదీరారు. స్వామివారిని దర్శించేందుకు వెళ్ళిన భక్తులు అంగ ప్రదక్షిణలు చేశారు. తరువాత కళ్ళలగర్‌స్వామి మళ్ళీ రామరాయర్ మండపానికి చేరుకున్నారు. రాత్రి 11 గంటలకు దశావతార వేడుకలు ప్రారంభమయ్యాయి. కళ్ళలగర్ స్వామి వైగైనదిలో వేంచేసిన తరువాత స్వక్షేత్రానికి బయలుదేరుతుండగా మదురై వాసులంతా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్వామివారు తిరుగు ప్రయాణ మార్గంలో ఉన్న వివిధ ఆలయాల్లోనూ భక్తులకు దర్శనమిస్తూ వెళ్ళారు. కళ్ళలగర్ స్వామి గురు, శుక్రవారాల్లోనూ పలు ఆలయాలు, మండపాలలో వేంచేసిన మీదట ఈ నెల 27 అళగర్‌మలైలోని స్వక్షేత్రానికి చేరుకుంటారు.

వైభవంగా పుష్ప పల్లకీల ఊరేగింపు

- భారీగా హాజరైన భక్తులు

వేలూరు, ఏప్రిల్ 24: చిత్రా పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కరోనా కారణంగా రెండు సంవత్సరాల పాటు ఈ వేడుకలు జరగకపోవడంతో ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. వేడుకల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో వేదికలు ఏర్పాటుచేసి కచేరీలు నిర్వహించారు. విద్యుద్దీపాలతో అలంకరించిన పల్లకీల్లో ప్రత్యేక అలంకరణంలో ఉత్సవమూర్తులు ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. జలకంఠేశ్వరుని ఆలయ పుష్ప పల్లకి, సెల్వవినాయకుడి పుష్ప పల్లకీ, దారాకేశ్వరుడి పుష్ప పల్లకీ, విష్ణు దుర్గా ఆలయ పుష్ప పల్లకి, పెరుమాళ్ ఆలయ పుష్ప పల్లకి, దుర్గా అమ్మన్ ఆలయ పుష్ప పల్లకి, వేంబులి అమ్మన్ పుష్ప పల్లకి, లక్ష్మీ నరసింహస్వామి పుష్ప పల్లకి మొత్తం 8 పుష్ప పల్లకీలు ఒకదాని తర్వాత మరొకటి, మేళతాళాలు, డీజే బృందాలు, పలురకాల వాద్యబృందాలతో తరలివచ్చాయి. మండి వీధి, లాంగ్ బజార్, కమ్‌సరి బజార్, పిల్లర్ బెల్ రోడ్డు మీదుగా అన్నాసాలై చేరుకొని, అక్కడి నుంచి వేలూరు కోట రహదారుల్లో పల్లకీల ఊరేగింపు సాగింది. వేడుకల్లో తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాలకు చెందిన సుమారు లక్ష మందికి పైగా భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు నడిపింది.







విద్యుద్దీపాలంకరణలో పుష్ప పల్లకీలు

ఎంసీహెచ్‌లో ఆధునిక రేడియేషన్ థెరపీ



రేడియేషన్ పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కేఎం చెరియన్

పెరంబూర్, ఏప్రిల్ 24: నార్త్ చెన్నైలోని 'మెరిడియన్ క్యాన్సర్ హాస్పిటల్ (ఎంసీహెచ్)'లో ఆధునిక రేడియేషన్ థెరపీ పరికరం ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో ఉన్న రేడియేషన్ అంకాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఏర్పాటుచేసిన పరికరాన్ని ప్రముఖ వైద్యులు డా.కేఎం చెరియన్, డా.గీత హరిప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకులు మాట్లాడుతూ... దేశంలో బ్రెస్ట్, గొంతు క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. 2022లో కొత్తగా 14.1 లక్షల కొత్త కేసులు నమోదవుతున్నాయన్నారు. తొలిదశలోనే క్యాన్సర్ లక్షణాలు గుర్తించి తగిన చికిత్స అందిస్తే వ్యాధి పూర్తిగా నివారించవచ్చన్నారు. క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టామని, అలాగే, మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆధునాతన రేడియేషన్ మెషీన్ ఏర్పాటుచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

జెమ్ ఆస్పత్రిలో 'ఫ్యాటీ లివర్ క్లినిక్'

- 4 వరకు ఉచిత శిబిరం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరుంగడిలో వున్న జెమ్ ఆస్పత్రిలో 'ఫ్యాటీ లివర్ క్లినిక్' ప్రారంభమైంది. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సి.పళనివేల్, సీఈవో డాక్టర్ ఎస్.అశోకన్ తదితరులు బుధవారం ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోకన్ మాట్లాడుతూ... క్లినిక్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మే 4వ తేదీ వరకు ఉచిత శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల వారి కోసం ఈ అవకాశం కల్పించామని వివరించారు. ఫైబ్రో స్కాన్, లివర్ ఫంక్షన్ పరీక్షలు, హెపటైటిస్ బి, సి.వైరస్ పరీక్ష, అల్ట్రా సౌండ్ స్కాన్, ఫ్యాటీ లివర్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ వంటి ప్రక్రియలు నామమాత్రపు ఖర్చుతో నిర్వహిస్తామని వివరించారు.

చిత్రాపౌర్ణమి వేడుకలు

తిరుచెందూరు తీరంలో భక్తుల జాగారం

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమి సందర్భంగా తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయానికి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. సముద్రతీరంలో స్నానం చేసి, పగటిపూట వ్రతమాచరించి రాత్రి పున్నమి వెన్నెలలో తీరం పొడవునా సేదతీరి జాగారం చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలన్నీ వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని వేకువజాము నాలుగుగంటలకే ఆలయాన్ని తెరచి, 4.30 గంటలకు విశ్వరూపం, ఐదుగంటలకు ఉదయమార్తాండ అభిషేకం నిర్వహించారు. ముందుగా భక్తులంతా సముద్రస్నానం చేసి ఆలయ ప్రాంగణంలో, పరిసరాల్లో ఉపవాస దీక్షలు, వ్రతమాచరించారు. రాత్రి ఏడు గంటలకు అందరూ సముద్రతీరం పొడవునా ఇసుక తిన్నలపై కూర్చుని పండు వెన్నెల సమయంలో అల్పాహారం, ఫలహారాలు సేవించి దీక్ష, వ్రతాన్ని ముగించారు. బుధవారం వేకువజాము వరకూ భక్తులంతా వెన్నెలలోనే జాగారం చేశారు.



→ తిరుచెందూరు సముద్రతీరంలో వెన్నెల్లో జాగారం చేస్తున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రత్నగిరిలో 1008 జ్యోతుల పూజ

వేలూరు, ఏప్రిల్ 24: రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న దుర్గమ్మవారి సన్నిధిలో మంగళవారం రాత్రి 1008 జ్యోతుల పూజ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో 1008 మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఈ వేడుకలను బాలమురగున్ ఆలయ స్థాపక నిర్వాహకుడు, రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి ప్రారంభించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్న, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉమ్మిడి జ్యూవెలర్స్

మల్టీ సఫైర్ కలెక్షన్స్



అడయార్, ఏప్రిల్ 24: నగరంలోని ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థల్లో ఒకటైన ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ , ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ (పీజీఐ) - ఇండియాతో కలిసి అద్భుతమైన ప్లాటినమ్ ఎవరా మల్టీ సఫైర్ కలెక్షన్స్ ఆవిష్కరించింది. 124 యేళ్ళ సుదీర్ఘ వారసత్వం కలిగి, దక్షిణ భారతదేశంలోని విశ్వసనీయ వారసత్వ ఆభరణాల తయారీ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన, సాంప్రదాయ సౌందర్యాన్ని సమకాలీన అంశాలతో కలపి అత్యాధునిక డిజైన్లతో ఈ సంస్థ బంగారు ఆభరణాలను తయారు చేస్తోంది. ఇపుడు పీజీఐ-ఇండియాతో కలిసి వీబీజే అత్యుత్తమ కళాకారులు డిజైన్ చేసిన మల్టీ బ్లూ సఫైర్ కలెక్షన్లను నగరవాసులకు అందుబాటులో ఉంచింది. ఈ అంశంపై వీబీజే మేనేజింగ్ పార్ట్నర్ అమరేంద్రన్ ఉమ్మిడి మాట్లాడుతూ, బ్లూ సఫైర్ కలెక్షన్స్ పీజీఐతో కలిసి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సేకరణ కళాత్మక, సృజనాత్మకతకు అద్దంపట్టేలా ఉంటుందని, కస్టమర్లకు కూడా వివేచనాత్మకమైన ఆఫర్ కూడా అందుబాటులో ఉందన్నారు.

డాగ్ స్క్వాడ్‌లో మూడు బెల్జియం జాగిలాలు

సందీప్‌రాయ్ రాథోడ్



→ బెల్జియం షెప్పర్డ్ జాగిలాలతో నగర పోలీస్ కమిషనర్

పెరంబూర్, ఏప్రిల్ 24: నగర పోలీసు శాఖలో ఉన్న డాగ్ స్క్వాడ్‌లో మరో మూడు బెల్జియం షెప్పర్డ్ జాగిలాలు చేరాయి. స్నైపర్ డాగ్ స్క్వాడ్‌లో ప్రస్తుతం 21 జాగిలాలుండగా, వాటిలో బాంబులు గుర్తించడం, బెదిరింపు చర్యలను సత్వరం కనుగొనడానికి వినియోగిస్తుండగా, నేరస్తుల గుర్తింపునకు 6, మాదకద్రవ్యాలు కనుగొనేందుకు ఒక జాగిలం పనిచేస్తున్నాయి. తాజాగా, బెల్జియం షెప్పర్డ్ జాతికి చెందిన మూడు నెలల వయస్సున్న 'కర్లోస్', 'ఛార్లెస్', 'లాండో' అనే మూడు జాగిలాలు చేరాయి. ఈ జాగిలాలను బుధవారం నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పరిచయం చేశారు. అదే సమయంలో ఈ బృందంలో పనిచేసి పలు కేసుల్లో నిందితుల గుర్తింపుకు సహకరించిన ఐదు జాగిలాలకు పదవీ విరమణ ప్రకటించి స్థానిక మాధవరం డాగ్ స్క్వాడ్ కెన్నల్స్‌లో సంరక్షిస్తున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

29 నుంచి 'ది మెలాంజ్' ఎగ్జిబిషన్



అడయార్, ఏప్రిల్ 24: ఈ నెల 29, 30వ తేదీల్లో 'ది మెలాంజ్' పేరుతో కళాత్మక ప్రదర్శన జరుగనుంది. ఆష్మా, వందన పల్సాని సంయుక్తంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో లగ్జరీ వస్తు ఉత్పత్తులు సరసమైన ధరలు లభ్యమవుతాయని, ముఖ్యంగా సరికొత్త షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ 40 మంది ప్రతిభావంతులైన డిజైనర్ల సృజనాత్మక, నైపుణ్యానికి అద్దంపట్టేలా ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ప్రదర్శనలో ఉంచే అన్ని రకాల ఉత్పత్తులు రూ.25 వేల కంటే తక్కువ ధరలోనే అందుబాటులోనే ఉంటాయని పేర్కొన్నారు. నాణ్యమైన దుస్తులు, ఉపకరణాలు, స్టైలిష్ పాదరక్షకులు, ఆకర్షణీయమైన గృహాలంకరణ వస్తువులు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో స్థానిక జెమిని వంతెన వద్ద ది పార్క్ హోటల్‌లో ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

ఇదీ మందు

బాబ్బాబు.. ఈసారి మీరడిగిందిస్తా!

తప్పు జరిగిపోయిందబ్బా... ఈదఫా మీరు ఏది చెబితే అది చేస్తాను..? ఎవరు ఏమిటన్నది తెలుసుకున్నాను. మళ్లీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తాను... చంద్రగిరి నియోజకవర్గంలో రోజురోజుకూ చేజారిపోతున్న స్వపక్షీయులకు వైసీపీ నాయకుడు బుజ్జగిస్తూ చెబుతున్న మాటలివి.. గతఎన్నికల్లో తిరుపతి రూరల్ మండలంలో వైసీపీ విజయానికి చొక్కాలు చింపుకుని పనిచేసిన పలువురు కీలకనేతలు ఇప్పుడు ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతున్నారు. టీడీపీ కండువా కప్పుకుంటున్నారు. మొదట మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన నేతలు ఇప్పుడు డ్యామేజీని గుర్తించారు. దీంతో సీరియస్‌గా మధ్యవర్తిత్వ రాజకీయానికి తెరలేపారు. అనుచరులను రంగంలోకి దింపి బుజ్జగింపులు ప్రారంభించారు. వీరు ద్వితీయ శ్రేణి నేతల ఇళ్లకు వెళ్లి బతిమలాడుతున్నారని తెలిసింది. కొందరు బైపాస్ రోడ్డులోని కేఫ్‌లు, రెస్టారెంట్లు వేదికగా మంతనాలు సాగిస్తున్నారు. ఈదశలో పార్టీ మారకుండా కట్టడి చేయడం కష్టమని.. తమచేతుల్లో ఏమీలేదని ద్వితీయశ్రేణి నేతలు బదులిచ్చేసరికి మధ్యవర్తులు బిక్కముఖం వేస్తున్నారు. రెండ్రోజుల కితం ఒకే సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు నేతలతో కమిటీని వేసి పంచాయతీల వారీగా బాధ్యతలు అప్పగించారని తెలిసింది. మళ్లీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తానని ప్రాధేయపడినా నేతలు మాత్రం బయటకు వచ్చి మనపని మనం చేసుకుపోదామని చర్చించుకున్నారని తెలిసింది.

- తిరుపతి రూరల్



తగ్గేదే..లే..

'వాళ్లు ఐదేళ్లు మన పొట్టమీద కొట్టారు.. మనం ఈసారి ఓటుతో వాళ్ల మూలాలనే దెబ్బతీద్దాం' అని కూడబలుక్కున్నారు చిల్లకూరు మండలంలోని సిలికా మైన్ల యజమానులు. కోట, చిల్లకూరు మండలాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో 77 సిలికా మైన్లు ఉన్నాయి. ఇవన్నీ స్థానిక చోటా, బడా నేతల ఆధీనంలోనే ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక తీరు మారిపోయింది. సిండికేట్ ఏర్పాటుచేసి అందులో చేరాలంటూ స్థానిక యజమానులను ఆదేశించారు. వారు అంగీకరించకపోవడంతో నేరుగా అధికారపార్టీ నాయకులే రంగంలోకి దిగి మైన్లు లాగేసుకున్నారు. దీంతో స్థానిక యజమానులంతా కుదేలయ్యారు. ఆర్థికంగా చిక్కిపోయారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీకి సహకరించకూడదని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. గ్రహించిన వైసీపీ నేతలు మళ్లీ రంగంలోకి దిగారు. రాయలసీమకు చెందిన మంత్రి తిరుపతికి వీరందరినీ పిలిపించుకొని మాట్లాడినట్టు చెబుతున్నారు. గెలిచాక మైన్లు మీకే అప్పగిస్తామంటూ నమ్మబలికారు. నిన్నటిదాకా తమ బతుకులను అతలాకుతలం చేసిన వైసీపీ నేతల మాయమాటలను వీరు విశ్వసించేలా లేరు. వెనక్కు తగ్గబోమని అంతర్గతంగా చర్చించుకుంటున్నారని సమాచారం.

-కోట

జన కేతనం


www.andhrajyothy.com

గురువారం 25 ఏప్రిల్ 2024



కాళంగి నది

ఆ రోడ్డేది మధుసూదనా...




స్వర్ణముఖి నది ఒడ్డున కనకాచలం కింద రోడ్డు ప్రతిపాదించిన స్థలం

అదిగో శివం టు శివం రోడ్డు.. ఇవిగో పనులంటూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపించారు. శ్రీకాళహస్తికి మహర్దశ వచ్చేసిందంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ఒక్క అడుగూ ముందుకు పడకుండానే ఐదేళ్లూ గడిపేశారు. పూతలపట్టు-నాయుడుపేట రహదారి బైపాస్ వంతెన నుంచి ముక్కంటి ఆలయం వరకు శివం టు శివం రోడ్డును గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. స్వర్ణముఖి నది ఒడ్డున కనకదుర్గమ్మ వెలసిన కనకాచలం కొండకు ఆనుకుని రామసేతు వంతెన నుంచి రోడ్డు సాగాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బైపాస్ వంతెన వద్ద అర్ధనారీశ్వర స్వామి ఆలయం నుంచి ముక్కంటి ఆలయం వరకు రూ.20 కోట్ల నిధులతో శివం టు శివం రోడ్డు నిర్మించేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఆచరణదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయించలేకపోయారు. రోడ్డు నిర్మించాల్సిన మార్గంలో స్వర్ణముఖి నది కరకట్ట అలాగే దర్శనమిస్తుంది. కనకాచలం కొండ వద్ద పాత పరిస్థితి కూడా ఏమాత్రం మారలేదు. శివం టు శివం రోడ్డు ఎక్కడైనా కనబడిందా... ఎవరైనా చూశారా అంటూ ఇక్కడి ప్రజలు చలోక్తులు విసురుతున్నారు.

- శ్రీకాళహస్తి

జనం చెవిలో జగన్ పూలు





● అధినేత బాటలో వైసీపీ తమ్ముళ్లు

గత ఎన్నికల్లో అధికారం కోసం జగన్ ఎడాపెడా హామీలు గుప్పించారు. సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా అన్ని వర్గాలకూ మాటిచ్చేశారు. మాట తప్పను - మడం తిప్పను అంటూ ప్రగల్భాలు పలికారు. సీఎం గద్దెనెక్కాక తానిచ్చిన హామీలను గాలికొదిలేశారు. అధినేత బాటనే వైసీపీ నాయకులూ అనుసరించారు. తమ నియోజకవర్గాల్లో హామీలిచ్చేశారు. అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా జనం చెవిలో పువ్వు పెట్టారు. ఆ కోవలోకి వచ్చే హామీలను మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...

రైతుల ఆశలకు జగన్ సర్కార్ 'చెక్'

● టీడీపీ ప్రభుత్వంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదన
● ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోని నాయకులు

మా వైసీపీ అధికారంలోకి రాగానే కాళంగి నదిపై నాలుగు చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తాం...

2019 ఎన్నికల వేళ వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలకిచ్చిన హామీ ఇది. ఆయన గెలిచారు. వైసీపీ ప్రభుత్వమూ ఏర్పడింది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల హామీని మాత్రం విస్మరించారు.

జిల్లాలో ఏడు మండలాల్లో సుమారు లక్ష ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షకంగా సాగు నీరందించే కాళంగి నదిపై చెక్ డ్యాముల ఏర్పాటు కలగానే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఏటా వర్షాకాలంలో వృధాగా పోతున్న లక్ష క్యూసెక్కుల వరద నీటి నిల్వకు చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు చేయిస్తానన్న ఎమ్మెల్యే సంజీవయ్య మాట నిలబెటుకోలేదు. చెక్ డ్యాములు నిర్మిస్తారని ఐదేళ్లూ నిరీక్షించి రైతులు నీరసపడ్డారు. పిచ్చాటూరు మండలం ఆరణియార్‌కు పశ్చిమంగా ఉన్న నగరి కొండల్లో చిన్న కాలువగా పుట్టి, పిచ్చాటూరుతో పాటు, కేవీబీపురం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల మీదుగా ప్రవహించి పులికాట్ సరస్సులో కలిస్తుంది కాళంగి నది. వర్షాకాలంలో లక్షలాది కొద్దీ క్యూసెక్కుల వరద నీటితో జలకళ ఉట్టిపడుతుంది. తర్వాత వరద నీరు పులికాట్ సరస్సులో కలిసిపోతోంది.

టీడీపీ ప్రభుత్వంలో కొంత కదలిక

వర్షపు నీటిని దిగువ ప్రాంతంలో నిల్వ చేయగలిగితే లక్ష ఎకరాలకు సాగు నీరందుతుందని ఇరిగేషన్‌శాఖ అధికారులు లెక్కలేశారు. రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో నీరు వినియోగించుకోవచ్చు. నది పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. వ్యవసాయ బోర్ల ద్వార రెండు పంటలను పండించుకునే అవకాశం ఉంటుంది. అందుకే 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.56 కోట్లతో నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి తొలి అడుగు వేసింది. నిధుల మంజూరుకు సుముఖత చూపింది. టెక్నికల్ అంచనాలు సరిచేసే ప్రక్రియలో కొంత ఆలస్యమైంది. ఈలోగా ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఆ ప్రతిపాదనలను అటకెక్కించింది. అన్నదాతల కోరిక నెరవేరలేదు.

- దొరవారిసత్రం



తనియాలి వద్ద కాళంగిపై పురాతన ఆనకట్ట

కొండెక్కిన జగన్ హామీ



విస్తరణ అనంతరం తిరుమల శ్రీవారి ఆలయం మాడవీధులు

● ప్రత్యామ్నాయం చూపకుండా తిరుమల స్థానికులకు మొండిచేయి

'తిరుమల మాడవీధుల విస్తరణలో దుకాణాలు కోల్పోయిన 186 మంది వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయిస్తాం'

- గత ఎన్నికల సమయంలో జగన్ తిరుమల స్థానికులకు ఇచ్చిన హామీ ఇది.

జగన్ హామీలను నమ్మి మోసపోయిన వారిలో శ్రీవేంకటేశ్వరస్వామిని పాదాల దగ్గర నివసించే తిరుమల స్థానికులు కూడా ఉన్నారు. శ్రీవారి ఉత్సవ మూర్తులను ఊరేగించేందుకు, తిరుమల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు టీటీడీ దశల వారీగా ఆలయ మాడవీధులను అభివృద్ధి చేసింది. 1998 నుంచి 2018 వరకు ఆలయానికి ఆనుకుని ఉన్న కట్టడాలు, చెట్లు, బండరాళ్లు తొలగించారు. 2001-04 మధ్య ఆలయం చుట్టూ ఉన్న ఇళ్లు, దుకాణాలు, మఠాలు, చిన్నచిన్న ఆలయాలను తొలగించారు. ఇళ్లు, దుకాణాలు తొలగించిన క్రమంలో తిరుమల స్థానికులు, టీటీడీ అధికారుల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. జీవనాధారంతో పాటు ఇళ్లు కూడా లాగేసుకుంటే ఎక్కడ నివసించాలంటూ స్థానికులు తిరగబడ్డారు. దీంతో ప్రత్యామ్నాయంగా దుకాణాలను కేటాయిస్తామని చెప్పడంతో స్థానికులు చల్లబడ్డారు. దశలవారీగా కొందరికి ఇళ్లు, మరికొందరికి దుకాణాలు కేటాయించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములున్న వారు రెండు దుకాణాలు కేటాయించాలని పట్టుబట్టి ప్రత్యామ్నాయం పొందలేకపోయారు. కుటుంబంలో ఒకరు దుకాణాన్ని పొందాక, అదే కుటుంబానికి చెందిన మరొకరు కూడా న్యాయం చేయాలంటూ టీటీడీపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇలా కొన్నేళ్లుగా తిరుమల స్థానికులు టీటీడీ చుట్టూ తిరుగుతూ వచ్చారు. ప్రతి కుటుంబానికీ ప్రత్యామ్నాయంగా ఇళ్లు, దుకాణాలు కేటాయించామని, ఇక ఈకేటగిరీలో ఎవరికి ఎలాంటి ఇవ్వాల్సిన అవసరం లేదంటూ టీటీడీ బోర్డు తీర్మానం చేసింది. తిరుమల స్థానికులు మాత్రం 186 మందికి దుకాణాలు రావాల్సి ఉందని పోరాటాలు చేశారు. ఈక్రమంలోనే గత ఎన్నికల సమయంలో జగన్ 186 మందికి ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తిరుమల స్థానికులు జగన్ మాటల మాయలో పడ్డారు. సమస్య తీరిపోతుందని నమ్మారు. కానీ వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

- తిరుమల

సత్యవేడు వర్తమానం



ఆదిమూలం

నియోజకవర్గంలో స్థానికేతర అంశం అధికార వైసీపీనీ ముచ్చెమటలు పట్టిస్తోంది. స్థానికులకే టికెట్ ఇవ్వాలని పెరిగిన డిమాండ్, ఇరవై రోజుల వ్యవధిలో రెండుసార్లు అభ్యర్థుల మార్పు, కేడర్ అభిప్రాయాలను పట్టించుకోకుండా అభ్యర్థిని ప్రకటించడం లాంటి అంశాలతో ఆ పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఫలితంగా వైసీపీ కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది.

- సత్యవేడు

ఫ్యానుకు లోకల్ స్ట్రోక్

● సత్యవేడు వైసీసీ ఉక్కిరిబిక్కిరి ● స్థానిక అంశంతో కేడర్‌లో అసంతృప్తి
● దళితుల్లో ఆదిమూలంపై పెరిగిన సానుభూతి ● అభ్యర్థి రాజకీయానుభవంతో టీడీపీలో జోష్

సత్యవేడు ఎన్నికల బరిలో వైసీపీ ఎదురీదుతోంది. ఇక్కడ ఆ పార్టీ తరఫున 2019 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీని వీడి అనూహ్యంగా టీడీపీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత జనవరిలో వైసీపీ విడుదల చేసిన మూడవ జాబితాలో ఆదిమూలంను తిరుపతి ఎంపీ అభ్యర్థిగా, తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. ఎంపీగా వెళ్ళేందుకు ఇష్టం లేని ఆదిమూలం తిరస్కరించారు. ఎమ్మెల్యే స్థానం నుంచి తప్పించి, ఎంపీగా కూడా టికెట్ లేకుండా చేయాలని పెద్దిరెడ్డి కుట్రపన్నారని ఆదిమూలం గట్టిగా గళం విప్పారు. పెద్దిరెడ్డిపై ఆయన ఆరోపణలు సంధిస్తూ ధిక్కారస్వరం వినిపించడం రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టించాయి. దీంతో ఆదిమూలంను సస్పెండ్ చేసేందుకు పార్టీ నిర్ణయం తీసుకుంటున్న తరుణంలో ఆయన టీడీపీతో టచ్‌లోకి వెళ్ళారు. ఈ పరిణామంతో వైసీపీ కంగు తింది. తిరుపతి ఎంపీ స్థానానికి సరైన అభ్యర్థి దొరక్క గురుమూర్తినే మళ్ళీ ఎంపీ అభ్యర్థిగా, మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ను సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది.

నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి

రాజేష్ స్థానికేతరుడు కావడం, స్థానిక సమస్యల పట్ల అవగాహన లేకపోవడం, పట్టుమని నలుగురు నాయకుల పేర్లు కూడా సరిగ్గా చెప్పలేని స్థితిలో ఉండడంతో నియోజకవర్గంలో వైసీపీ నుంచే నిరసన సెగలు తగిలాయి. కనీస పరిచయం లేని వారికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదని, స్థానికులకే టికెట్ ఇవ్వాలని కేడర్ బహిరంగంగా డిమాండ్ చేస్తూ వచ్చారు. ఓ దశలో అభ్యర్థి మార్పు తప్పదన్న ప్రచారం కూడా జరిగింది. ఈ అసంతృప్తిని చల్లార్చేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రంగంలోకి దిగి పలుమార్లు చర్చించారు. అయినా అసంతృప్తి మాత్రం నివురుగప్పిన నిప్పులానే ఉంది. మెజారిటీ నాయకులు పార్టీ గెలుపుకోసం పనిచేసేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. దీనికి తోడు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఎమ్మెల్యేను డమ్మీగా చేసి జిల్లా కీలక నేత, ఆయన అనుచరులు యథేచ్ఛగా సాగించిన ఇసుక, గ్రావెల్ తదితర సహజ వనరుల దోపిడీ ఫ్యాను పార్టీలో గుబులు రేకెత్తిస్తోంది.

ఏకతాటిపైకి టీడీపీ

పెద్దిరెడ్డిని ధిక్కరించి వైసీపీని వీడిన ఆదిమూలంపై ఆ పార్టీలోని ప్రధాన సామాజిక వర్గం చేసిన అమానుష వైఖరి పట్ల దళిత వర్గాల్లో ఆయనకు సానుభూతి పెరిగింది. మంత్రిపై చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ప్రధాన సామాజిక వర్గ నేతలు ఆయన దిష్టిబొమ్మలు దహనం చేసిన తీరు ఆదిమూలంకు అమాంతం ఆదరణను తెచ్చి పెట్టింది. ఈ నేపథ్యంలో పెత్తందారులపై చేసిన తిరుగుబాటును గుర్తించి ఆదిమూలంను అనూహ్యంగా టీడీపీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఆరంభంలో టీడీపీ శ్రేణులకు కొంత నిరాశ కలిగించింది. ఆదిమూలం మాత్రం నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తల ఇళ్ళకు వెళ్ళి ఏకతాటి పైకి వచ్చేలా కలుపుకొన్నారు. ఇటీవల నియోజకవర్గంలో చంద్రబాబు నిర్వహించిన పర్యటనతో టీడీపీలో మరింత జోష్ పెరిగింది. ఆదిమూలం స్థానికుడు కావడం, స్వతహాగా ఉద్యమాల నేపథ్యమున్న వారు కావడం, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నియోజకవర్గంలోని 700 గ్రామాల్లో ఇరు పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలను పేర్లతో సహా పలకరించడం లాంటి అంశాలు టీడీపీకి కలిసొస్తున్నాయి. నియోజకవర్గంలో తమ జెండా ఎగురవేయడం ఖాయమని టీడీపీ శ్రేణులు బలంగా విశ్వసిస్తున్నాయి.



నూకతోటి రాజేష్

చంద్రబాబు పర్యటనతో వైసీపీలో టెన్షన్

టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల నిర్వహించిన ప్రజాగళం వైసీపీలో టెన్షన్‌కు గురిచేసింది. సత్యవేడులో పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు ఇసుక, గ్రావెల్, మట్టిని దోపిడి చేస్తున్నారని ఆయన చేసిన ఆరోపణలు, ఇక్కడ రాజకీయాలపై పెద్దిరెడ్డి పెత్తనమేంటని చేసిన సునిశిత విమర్శలు నియోజకవర్గ ప్రజల మనసులను సూటిగా తాకాయి. పెద్దిరెడ్డిపై ఆదిమూలం తిరుగుబాటుకు చంద్రబాబు నుంచి వచ్చిన సానుకూల స్పందన దళిత సామాజికవర్గాల్లో చర్చకు దారితీసింది.

ఈ బండే ఆయన విజయరథం

సెంటిమెంట్

రాజకీయాల్లో ఒక్కొక్కరికీ ఓ సెంటిమెంటు ఉంటుంది. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏపీ26ఎస్ 0668 నంబరు గల మోటారు సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తుంటారు. బాలాయపల్లి మండలం పెరిమిడికి చెందిన గడ్డం మురళి ఈ వాహనం నడిపితే ఆయన వెనుక కూర్చుంటారు. కొద్దిరోజులుగా ఆ మోటారు సైకిల్ మళ్లీ ఆయన ఇంటివద్ద కనిపిస్తుండటంతో అక్కడి వారంతా ఇదే విషయాన్ని ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. 2009, 2014 ఎన్నికల్లో రామకృష్ణ ఈ మోటర్ సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. రెండు సార్లూ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం మోటారు సైకిల్ మార్చారు. సెంటుమెంట్ మిస్సవ్వడం వల్లే ఇలా జరిగిందని రామకృష్ణ అనుచరులు భావించారు. తొలుత ఆయన కుమార్తెకు టీడీపీ టికెట్ ఇచ్చినా తాజా మార్పుల్లో రామకృష్ణనే బరిలో నిలపాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. బుధవారం ఆయన 'సెంటిమెంటు బండి' మీదనే వెళ్లి నామినేషన్ వేశారు. దీంతో ఆయన అనుచరులంతా విజయం మనదే అని నినదించారు.

- వెంకటగిరి, డక్కిలి



నామినేషను వేయడానికి తన సెంటిమెంట్ ద్విచక్ర వాహనం మీద వెనుక కూర్చుని వెళ్తున్న కురుగొండ్ల రామకృష్ణ